క్లుప్తంగా

కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు

పాలకోడేరు: మండలంలోని గరగపర్రు గ్రామానికి చెందిన శ్రావణి సంధ్య తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని బుధవారం పోలీసులను ఆశ్రయించింది. తనకు అత్తిలి మండలం దంతిపల్లికి చెందిన వీరవల్లి నాగార్జునతో 2016 లో వివాహమైందని, పెళ్లి సమయంలో 2 లక్షలు, ఆడపడుచుకట్నం 30 వేలు నగదు ఇచ్చామని పేర్కొన్నారు. తమకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని వివరించారు. అయితే నాగార్జున మద్యం సేవించి ప్రతిరోజు అదనపు కట్నం కోసం తరచూ వేధిస్తూ, మానసికంగా బాధలు పెడుతున్నాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

రేపు పెదఅమిరంలో భారీ ప్లాంటేషన్ కార్యక్రమం

కాళ్ల: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా శుక్రవారం భారీ ప్లాంటేషన్ కార్యక్రమం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభిస్తారని ఎంపీడీవో జి.స్వాతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు తొలుత కలెక్టర్ బంగ్లా ప్రాంతంలో ఈ కార్యక్రమం వివరించారు. అనంతరం జక్కరం, కోపల్లె గ్రామాల్లో కూడా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్వయం సహాయక గ్రూపుల సభ్యులు పంచాయతీ పాలకవర్గం సభ్యులు, గ్రామ పెద్దలు, స్వచ్ఛంద సంస్థలు, ఉపాధి హామీ వేతనదారులు, పాఠశాల విద్యార్థులను భాగస్వాములుగా చేసి మొక్కలు నాటిస్తామని ఆమె స్పష్టం చేశారు.

రక్షణకు, రాబడికి ధనవృద్ధి పాలసీ

ఆకివీడు: జీవిత బీమా పాలసీల్లో కొత్తగా వచ్చిన ధన వృద్ధి పాలసీ బీమాదారులకు రక్షణగానూ, రాబడినిస్తుందని స్థానిక ఎల్ఐసీ శాటిలైట్ కార్యాలయ బ్రాంచి మేనేజర్ పి.మురళీ చెప్పారు. ధన వృద్ధి పాలసీ ప్రచార రథాన్ని కార్యాలయం వద్ద బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవిత బీమా పాలసీలు చేయించుకోవడం ద్వారా ఎన్నో జీవితాలు ఆర్థికంగా స్థిరపడుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో డీఓ జీ.వీర కుమార్, కె.పోతరాజు, ఎస్.దుర్గారావు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యత



ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహిస్తున్న ఎంఈఓ రవీంద్ర

కాళ్ల: ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తుందని ఎంఈఓ ఎ.రవీంద్ర అన్నారు. కోపల్లె హైస్కూల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ ఉపాధ్యాయులు వృత్తిపరమైన నైపుణ్యాన్ని సాధించి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలని సూచించారు. విద్యార్థులు రీడింగ్ , రైటింగ్లో నైపుణ్యం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై సూచనలు ఇచ్చారు. సమావేశంలో ఎంఈఓ-2 జి.కనకరాజు, కోపల్లె హైస్కూల్ హెచ్ఎం కె.సుబ్బరాజు, కోపల్లె, బొండాడ, సీసలి పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

పాలకొల్లు సెంట్రల్: ఆక్వా రైతులు పడుతున్న సమస్యలపై స్పందించి సమావేశం ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్ రాజు కృతజ్ఞతలు తెలియజేశారు. బుధవారం స్థానిక ఆక్వా సంఘం భవనంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గాంధీ భగవాన్‌రాజు మాట్లాడుతూ ఆక్వా రైతుల సమస్యల పరిష్కారం కోం ఇటీవల ఆక్వా రైతులు సమావేశం ఏర్పాటు చేసి సంఘం నూతన కమిటీని ఎన్నుకుందన్నారు. సమస్యలపై ప్రభుత్వం ఆక్వా రైతుల కోసం ఏర్పాటు చేసిన అప్సా కమిటీతో ఇటీవల సమావేశం నిర్వహించి సమస్యలను తెలియజేశామన్నారు. వారం రోజుల్లోనే స్పందించిన ప్రభుత్వం అప్సా వైస్ చైర్మన్ వడ్డీ రఘురామ్ ఆధ్వర్యంలో ఈ నెల 31న కాకినాడలో ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్, ఫీడింగ్ యూనిట్ సంస్థలతో సమావేశం ఏర్పాటు చేయడం ఆక్వా రైతులకు శుభపరిణామమని అన్నారు. ఆక్వా రైతులు పెద్ద ఎత్తున సంఘంలో చేరితే సంఘం బలపడుతుందన్నారు. సంఘం బలంగా ఉంటే మన సమస్యలు కూడా సునాయాసంగా పరిష్కారం అవుతాయని తెలిపారు. కాకినాడలో జరగనున్న సమావేశంలో సంఘం నుండి ఇద్దరు సభ్యులకు ఆహ్వానం అందిందని తెలిపారు. ఈ సంఘంలో పాలకొల్లు, నరసాపురం, ఆచంట ఆక్వా రైతుల సమస్యలపై చర్చిస్తారన్నారు.

ఆర్బీకేలు.. రైతు నేస్తాలు

- ఎరువులు, విత్తనాల పంపిణీ
- అన్నదాతల ఆనందోత్సాహం



శ్రీరామపురంలోని ఆర్బీకే కేంద్రం

భీమవరం అర్బన్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను నెలకొల్పి, సొంత గ్రామంలోనే రైతులకు కావాల్సిన సేవలు అందిస్తున్నారు. రాయితీపై ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లను రైతులకు అందజేస్తున్నారు. గతంలో ఏ అవసరం వచ్చినా మండల కేంద్రాల్లో ఉండే వ్యవసాయ కార్యాలయానికి రైతులు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ ఆర్బీకేలు ఏర్పాటు చేయడంతో భీమవరం మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్బీకేల్లో భూసార పరీక్షలు చేస్తున్నారు. సాగులో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేందుకు రైతులకు సలహాలు ఇస్తుండటంతో ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి.

కియోస్క్‌లతో ప్రయోజనాలెన్నో

ఆర్బీకేల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కియోస్క్ మెషీన్లతో రైతులకు ఎంతో మేలు చేకూరుతోంది. వారికి కావాల్సిన నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు బుక్ చేసుకున్న 48 గంటల్లోనే రాయితీపై అందుతున్నాయి.

ఈ క్రాప్ నమోదు

ప్రతి రైతూ తాను సాగు చేసి పంటలకు ఈ క్రాప్ నమోదు చేయించుకుంటున్నారు. తద్వారా విపత్తులు, తుఫాన్ల కారణంగా పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి పంట నష్ట పరిహారం పొందే అవకాశం కలుగుతుంది. ఈక్రాప్ సర్టిఫికెట్ ద్వారా రైతులకు బ్యాంకులు పంట రుణాలు అందజేస్తున్నాయి.

2019 నుంచి రైతులకు చేకూరిన లబ్ధి
ఇన్‌పుట్ సబ్సిడీ :
4,327 మందికి రూ.3.58 కోట్లు
పీఎం కిసాన్, రైతు భరోసా :
17,248 మందికి రూ.21.28 కోట్లు
పంటల బీమా:
2,894 మందికి రూ.4.69 కోట్లు

మండలం	భీమవరం
గ్రామాలు	25
ఆర్బీకే సెంటర్లు	12 గ్రామాల్లో
ఆక్వా ఆర్బీకే సెంటర్లు	13 గ్రామాల్లో
రైతు	5,600
కౌలు రైతులు	2,500
వరి సాగు	9,000 ఎకరాలు
ఆక్వా సాగు	30,000 ఎకరాలు

తక్కువ ధరకే ఎరువులు, విత్తనాలు



గతంలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు ప్రైవేటు షాపుల్లో వారి చెప్పిన ధరకే కొనేవాళ్లం. గ్రామంలోనే ఆర్బీకే సెంటర్ ఉండటడంతో బుక్ చేసుకున్న 48 గంటల్లోనే ఎరువులు, విత్తనాలు, నాణ్యమైన పురుగు మందులు తక్కువ ధరకు అందుతున్నాయి. సీఎం జగన్ రైతుల పక్షపాతి.

– చిల్లిముంతల శ్రీనివాస్, రైతు, చినఅమిరం

మెరుగైన సేవలు



రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే సేవలపై ఎప్పటిప్పుడు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్నదాతలకు మెరుగైన సేవలందుతున్నాయి. ముఖ్యంగా రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నాం.

– నిమ్మల శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి, భీమవరం మండలం

తెరిపివ్వని వాన

భీమవరం అర్బన్: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా భీమవరం మండలం యనమదుర్రు, దిరుసుమర్రు, అనాకోడేరు, చినఅమిరం, రాయలం, గొల్లవానితిప్ప, తాడేరు, బేతపూడి, కొవ్వాడ అన్నవరం, వెంప తదితర గ్రామాల్లో బుధవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బదులు ఎదుర్కొన్నారు. పల్లపు గ్రామాలైన నాగిడిపాలెం, తోకతిప్ప, లోసరి, దొంగపిండి, కొత్తపూసలమర్రు, గూట్లపాడు, దెయ్యాలతిప్ప తదితర గ్రామాల్లో శివారు ప్రాంతాలు జలమయమయ్యాయి. గత మూడు రోజులుగా కురుస్తోన్న వర్షాలకు వ్యవసాయ పనులు నెమ్మదించాయి. భారీ వర్షాలతో కొన్ని చోట్ల వరినాట్లు, నారుమడులు నీటమునిగాయి. వాటిని రక్షించేందుకు రైతులు కారెంలతో, ఆయిల్ ఇంజన్లతో నీటిని బయటకు తోడుకుంటున్నారు.



అనాకోడేరులో నీటమునిగిన నారుమడి

ఆకివీడులో..

ఆకివీడు: గత మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల రోడ్లు నీట మునిగాయి. వాహనాల రాకపోకలతో రోడ్లు చిన్నాభిన్నమై గుంతలు గుంటలుగా ఏర్పడ్డాయి. పలు గ్రామాల్లో కూడా రోడ్ల పరిస్థితి ఇదే విధంగా ఉంది. జాతీయ రహదారి ప్రాంతం పలు చోట్ల నీట మునిగింది. స్థానిక ఎస్‌బీఐ, జెడ్పీ స్కూల్ ప్రాంతాల వద్ద జాతీయ రహదారిపై అడుగు లోతు నీరు నిలబడి ఉంది. పలు చోట్ల జాతీయ రహదారి ఇరువైపులా ఆక్రమణలకు గురికావడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోడ్డుపైనే నిలబడిపోయింది. ఆకివీడు ప్రాంతంలో 40 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

కాళ్లలో..

కాళ్ల: అల్పపీడన ప్రభావంతో గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రాష్ట్ర రహదారితో పాటు గ్రామాల్లో వీధులన్ని జలమయమయ్యాయి. గ్రామాల్లో డ్రైయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల స్థానిక వాసులు ఇబ్బందులకు గురయ్యారు. ప్రధానంగా కాళ్ల గ్రామంలోని పల్లపువీధి మొత్తం వర్షంనీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడటంతో పంచాయతీ సిబ్బంది నీరు మళ్లించే ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో రాష్ట్ర రహదారి, ఆర్ అండ్ బి రహదారులు వర్షపు నీటితో నిండిపోయాయి. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, అధికారులు వర్షపు నీటిని మళ్లించే చర్యలు చేపట్టారు.



నీటమునిగిన ఆకివీడు ఎస్‌బీఐ ప్రాంతం

వలంటీర్ల సేవలు అభినందనీయం

వలంటీర్లకు వందనం

నాకు 80 సంవత్సరాలు. నేను నడవలేను..నిలబడలేను...మా వలంటీర్ పోతుల జోషికుమారి సొంత మనవరాలు లాగా నాకు ప్రతి నెలా ఒకటో తారీఖున వచ్చి వృద్ధాప్య ఫించన్ అందిస్తోంది. అంతకుముందు పంచాయతీ ఆఫీస్‌కు ఆటోలో వెళ్లాల్సి వచ్చేది. దానికి వచ్చిన పింఛన్ లోంచి రెండు వందలు ఖర్చు చేయాల్సి వచ్చేది. అది కూడా రెండు మూడు సార్లు తిరగాల్సి వచ్చేది. ఒకసారి కళ్లు తిరిగి పడిపోయాను.



ఇలాంటి తిప్పలన్నీ వలంటీర్ వల్ల తప్పిపోయాయి. మునకాల మరియమ్మ, శృంగవృక్షం

చినమిల్లిపాడు ఎస్సీ కాలనీలో రూ.10 లక్షలతో రోడ్లు



చినమిల్లిపాడులో రోడ్లను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వేగేశ్న వెంకట్రాజు

ఆకివీడు: భారీ వర్షాలకు రోడ్లు పూర్తిగా పాడైపోతున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను) చెప్పారు. మండలంలోని కొల్లేరు తీరంలో ఉన్న చినమిల్లిపాడు గ్రామంలో రోడ్ల పరిస్థితిని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి రోడ్లు మరింత ధ్వంసమవుతున్నాయన్నారు. గ్రామంలోని ప్రధాన రోడ్డుతో పాటు, వీధుల్లోని రోడ్లు కూడా వర్షం ధాటికి ఛిద్రమయ్యాయని చెప్పారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆదేశాల మేరకు గ్రామంలోని రోడ్లు, ఎస్సీ కాలనీలోని రోడ్లను పరిశీలించామని చెప్పారు. తక్షణం కచ్చా డ్రెయిన్లు తవ్వించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్ల పరిస్థితిని పీవీఎల్ నర్సింహరాజుకు వివరించగా వర్షాలు తగ్గిన తరువాత ఉపాధి హామీ నిధులు రూ. 10 లక్షలతో ఎస్సీ కాలనీలోని రోడ్లను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారని యండగండి శ్రీను కాలనీ వాసులకు తెలిపారు. అదే విధంగా కాళింగగూడెం నుండి చినమిల్లిపాడు వచ్చే ప్రధాన రహదారికి మరమ్మతులు చేపడతామన్నారు. వర్షాలు తగ్గిన తరువాత ఆర్ అండ్‌బీలో ఉన్న ఈ రోడ్డుకు తన సహకారం, చేపల చెరువుల రైతుల సహకారం తీసుకుని మరమ్మతులు చేయిస్తామని పీవీఎల్ చెప్పినట్లు యండగండి శ్రీను గ్రామస్తులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎలినాటి వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ తంగి పుష్కరరావు, గ్రామ కమిటీ వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఇంటి ప్రేమానందం, గ్రామ ఆర్బీకే చైర్మన్ కె.డేవిడ్‌రాజు, విజయరావు(పండు), ఏసేబు తదితరులు పాల్గొన్నారు.

ముంపునకు గురైన నారుమడుల పరిశీలన



ఆకివీడులో చేలను పరిశీలిస్తున్న ఏడీఏ కేఎస్ఎస్.శ్రీనివాసరావు.

ఆకివీడు: వాయుగుండం ప్రభావంతో గత మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు నాట్లు వేసిన వరి చేలు, పలు గ్రామాల్లో నారుమడులు నీట మునిగాయి. వర్షం ఇదే విధంగా మరో మూడు రోజులు కురిస్తే నారుమడులకు ఇబ్బంది ఏర్పడనుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. గత పది హేను రోజులుగా నాట్లు వేసిన వరి చేలల్లోకి ముంపు నీరు భారీగా చేరుతోంది. దీంతో కొన్ని గ్రామాల్లో వరి మొక్కలు నీట మునుగుతున్నాయి. ఆకివీడు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 1161 ఎకరాల్లో నాట్లు నీట మునుగుతున్నాయి. ఇప్పటి వరకూ 77 ఎకరాల్లో నారుమడులు నీట మునిగాయి. వ్యవసాయ సహాయ సంచాలకులు కేఎస్ఎస్.శ్రీనివాసరావు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం ఆకివీడు మండలంలో 43 ఎకరాల్లో నారు, 432 ఎకరాల్లో నాట్లు వేసిన చేలు, ఉండి మండలంలో 20 ఎకరాల్లో నారుమడులు, 560 ఎకరాల్లో వరి చేలు, కాళ్ల మండలంలో 14 ఎకరాల్లో నారుమడులు, 169 ఎకరాల్లో నాట్లు వేసిన చేలు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. భారీ వర్షాలకు, ఎగువ నుండి వచ్చే ముంపు నీటికి రానున్న రోజుల్లో మరిన్ని చేలు నీట మునిగే అవకాశం ఉందని తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

యలమంచిలి: రాష్ట్రంలో ఉన్న ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందజేయడమే జగనన్న ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ రావూరి వెంకటరమణ అన్నారు. కాంబొట్లపాలెం, చింతదిబ్బ గ్రామాలకు సంబంధించి బుధవారం కాంబొట్లపాలెంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వాలన్నీ ప్రజలకు సంక్షేమ పథకాలు ఏ విధంగా ఎగ్గొట్టాలా అని ఆలోచనతో ప్రభుత్వ పథకాల అమలుకు అనేక నిబంధనలు పెట్టి అర్హుల సంఖ్య తగ్గించడానికి శతవిధాల కృషి చేసేవన్నారు. కానీ జగనన్న ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలు అందుకోవడానికి ఏ చిన్న అవరోధం ఉన్న వాటిని తొలగించి ఆ పథకాలను ప్రజలకు అందించడానికి జగనన్న సురక్ష పథకం ద్వారా శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. ప్రజలు గత ప్రభుత్వాలకు జగనన్న ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని గమనించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో రెండు గ్రామాల సర్పంచ్‌లు అనిశెట్టి మల్లిక, చిలుకూరి సూనావతి డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వ్యవసాయ సలహా మండలి యలమంచిలి మండల చైర్మన్, బూరుగుపల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ బొంతు వెంకట కర్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు శీలం వీరబాబు, ఎంపీటీసీ సభ్యురాలు కంబాల సత్యశ్రీ సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు పార్టీ నాయకులు ఉచ్చుల స్టాలిన్, రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, మంద హరికుమార్, అనిశెట్టి నవీన్, అనిశెట్టి జయరాజు, అనిశెట్టి ధర్మారావు, బండి శ్రీను, అంతర్వేది సీతారాముడు, మంద పెద్దిరాజు, రాయుడు లీలేశ్వరుడు, అనిశెట్టి గంగన్న, వీరా ఉమాశంకర్ ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై నిరసన



భీమవరంలో నిర్వహిస్తున్న శాంతి ర్యాలీ



చినమిల్లిపాడులో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

సాక్షి, భీమవరం: మణిపూర్ ఘటనకు నిరసనగా భీమవరంలో బుధవారం ఏపీ బహుజన జేఏసీ, ఐద్వా, ఏఐసీసీ సంయుక్త ఆధ్వర్యంలో శాంతియుత సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. వన్ టౌన్‌లోని త్యాగరాజ భవనం నుంచి ప్రకాశంచౌక్ మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ప్రకాశం చౌక్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా బహుజన జేఏసీ ఫౌండర్ అండ్ కన్వీనర్ తాళ్లూరి మధు, గౌరవాధ్యక్షుడు కాటం స్టాలిన్‌రాజు మాట్లాడుతూ కేంద్రంలో నిరంకుశ పాలన సాగుతోందని, మణిపూర్‌లో విధ్వంసం చోటుచేసుకుని రోజులు గడిచిపోతున్నా నిందితులను పూర్తిస్థాయిలో అరెస్టు చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు. మణిపూర్ ముఖ్యమంత్రి తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోనా జోసఫ్, బందిల ప్రమీలారాణి, పాలవెల్లి మంగ, పారపాటి అనిత, ఎస్ జయప్రభ, పాగాకు పూర్ణ, ఎండీ సరోజని, గంటా సుందరకుమార్, కేసీ రాజు, పాలపర్తి జోనా, బిరుదుగడ్డ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

- మణిపూర్ ఘటనకు నిరసనగా దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో భీమవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ మాట్లాడుతూ మణిపూర్‌లో ఘటనకు కారకులను తక్షణం అరెస్టు చేసి శాంతిభద్రతలను నెలకొల్పాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ గ్రంధి పవన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గొల్ల రాజ్‌కుమార్, పాలపర్తి జోనా, మరపట్ల మునియ్య, కేసీ రాజు, పట్టెం శుభాకర్, కర్రా కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ దోషులకు ఉరి శిక్ష వేయాలి

ఆకివీడు: మణిపూర్ సంఘటన యావత్ దేశం తలదించుకునే విషయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని చినమిల్లిపాడు గ్రామంలో మణిపూర్ సంఘటనపై బుధవారం క్రైస్తవ మహిళలు చర్చిలో మోకాలుపై నిలబడి ప్రార్థనలు చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి పలువురు మాట్లాడుతూ లౌకిక దేశంలో ఇటువంటి సంఘటనలు హేయమైనవి అన్నారు. కార్యక్రమంలో పాస్టర్ పళ్లెం దేవదాస్, మద్దా పేతురు, పీతల కాంతారావు, పండు, ఇంటి ప్రేమానందం, అంబటి రమేష్, ఎం. రత్న కుమార్, జి.ధనరాజు పాల్గొన్నారు.

ఓటు నమోదు తప్పనిసరి



డీఎన్నార్ కళాశాలలో విద్యార్థులకు ఓటు నమోదు పత్రం అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: యువతపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని, యువత తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకుని సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని భీమవరం డీఎన్నార్ కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, రెవెన్యూ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తోన్న ఓటు నమోదు, ఓటు హక్కు వినియోగం ప్రచార భేరి కార్యక్రమాన్ని డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాండు రంగరాజు మాట్లాడుతూ విద్యావంతులే ఓటు హక్కు వినియోగంలో నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. ప్రిన్సిపాల్ ఎం అంజన్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగపరంగా సంక్రమించే ఓటును ముందుగా నమోదు చేసుకోవడం ప్రతి పౌరుడి నైతిక బాధ్యతన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వర్మ, లైబ్రేరియన్ కె.శిరీష, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్ వి.ప్రవీణ్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉండిలో జగనన్న సురక్ష

ఉండి: గ్రామంలోని 4వ సచివాలయ పరిధిలో గురువారం ఉదయం 9:30 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఏవీ అప్పారావు బుధవారం విలేకరులకు తెలిపారు. ఉండిలోని కూనపరాజు అప్పలరాజు సీతమ్మ లయన్స్ కల్యాణ మండపంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులంతా విధిగా పాల్గొనాలని కోరారు.

కిడ్నాప్ యత్నంపై కేసు నమోదు

ఉండి: గ్రామానికి చెందిన ఇద్దరు యువకులపై పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం గ్రామానికి చెందిన యువతిని ఉండికి చెందిన వెన్నంటి సురేష్ అనే వ్యక్తి అతని స్నేహితుడు భగవతి రాజేష్‌తో కలసి ఈ నెల 24వ తేదీ అర్ధరాత్రి 2 గంటల సమయంలో బాధితురాలి ఇంట్లోకి చొరబడి కిడ్నాప్ చేసేందుకు యత్నించారు. దీనిపై బాధితురాలి అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కె.గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వరదల్లో కూడా డ్రాప్‌అవుట్స్‌పై దృష్టి



డ్రాప్ అవుట్స్ పిల్లలను స్కూల్లో అప్పగిస్తున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ

నరసాపురం రూరల్: విద్యార్థులు చదువుకుంటేనే భవిష్యత్ అని, వారు జీవితాల్లో పైకి వస్తారని నరసాపురం సబ్ కలెక్టర్ సూర్యతేజ అన్నారు. వర్షాల నేపథ్యంలో ఆయన బుధవారం తీర ప్రాంతంలో సుడిగాలి పర్యటన చేస్తూ నవరసపురం ఎస్టీ కాలనీని సందర్శించారు. ప్రజలు యోగక్షేమాలు తెలుసుకోవడంలో భాగంగా స్కూల్‌కి, కాలేజీకి వెళ్లకుండా దుబారాగా తిరుగుతున్న పలువురు విద్యార్థులను గుర్తించారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి వారి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చదువుకు ఎగనామం ఎందుకు పెట్టారనే విషయాలు తెలుసుకుని వెంటనే వారిని సంబంధిత విద్యాసంస్థల్లో చేర్పించేందుకు ఉపక్రమించారు. ఎస్టీ కాలనీలో మేడా ఏసురత్నం, గంధం సౌజన్యలను వెంటనే తన కారులో ఎక్కించుకుని ఒకరిని నరసాపురం పట్టణంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలోనూ, మరొకరిని వైఎన్ కళాశాలలో అప్పగించి అడ్మిషన్ రీఓపెన్ చేయించారు. కస్తూరిబా గాంధీ స్కూల్‌లో ఏసురత్నం ఎందుకు మానేశాడనే విషయంపై అక్కడి హెడ్ మాస్టర్ నల్లం రాజును వివరాలు అడిగారు. నవరసపురం నుంచి నరసాపురం వరకూ ఎస్టీ కాలనీ విద్యార్థులు రావడం కోసం నెలకు రూ.8 వేలు సొంత ఖర్చులతో ఆటో ఏర్పాటు చేశానని అయినప్పటికీ వారు రావడంలేదనే విషయాన్ని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు.విద్యార్థులకు చదువుపై మక్కువ పెంచేలా ఆలోచన చేయాలని అక్కడి ఉపాధ్యాయులకు సబ్ కలెక్టర్ సూర్యతేజ హితవు చెప్పారు.